ప్రజాశక్తి

మంగళవారం 28 ఫిబ్రవరి 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఎమ్మెల్సీ బరిలో 37 మంది

- పట్టభద్రుల శాసన మండలి స్థానానికి ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం ఓట్లు 289214
- పోలింగ్ కేంద్రాలు 331
- మార్చి 13న పోలింగ్
- జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి పోటీలో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. తన కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గానికి సంబంధించి పట్టబద్రుల శాసన మండలి ఎన్నికలపై ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డేడ చంద్రకళ పద్మావతి, ఈర్ల శ్రీరామమూర్తి, గూణూరు మళ నాయుడులు పోటీ నుంచి ఉప సంహరించుకున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 331 పోలింగు కేంద్రాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 59, విజయనగరంలో 72, పార్వతీపురం మన్యంలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15, విశాఖపట్నంలో 112, అనకాపల్లిలో 49 పోలింగు కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగు సిబ్బందికి ఈ నెల 28న, తిరిగి రెండో సారి మార్చి 7న శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బూత్ స్థాయి అధికారులతో ఓటరుకు స్లిప్పులు, ఓటరుకు సంబంధించిన సమాచారం అందిస్తారని, ఆబ్సెంటీ, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటరు జాబితాను ప్రెసైడింగ్ ఆఫీసర్లకు మెటీరియల్‌తో అందజేస్తామని తెలిపారు.

ఓటర్లు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రులకు సంబంధించి 2,89,214 ఓట్లు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 52256 మంది, విజయనగరం జిల్లాలో 58502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11525 మంది, విశాఖపట్నం జిల్లాలో 105697 మంది,

మిగతా 2లో..



సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్ధార్థ్ జైన్

ఎన్నికలు పారదర్శకంగా జరగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలని శాసన మండలి ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ సూక్ష్మ పరిశీలకులకు చెప్పారు. సోమవారం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి సూక్ష్మ పరిశీలకుల శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నియమావళి నియమ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 48 గంటల ముందు ప్రచారం ముగించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ఎలా జరుగుతుందో పరిశీలించాలని పేర్కొన్నారు. వెబ్ కాస్టింగ్, ఫొటోగ్రఫీలను పరిశీలించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా వెబ్ కాస్టింగ్, ఫొటోగ్రఫీ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు, ఓటరు మాత్రమే ఉండాలన్నారు. ఓటరు విభిన్న ప్రతిభా వంతులైతే ప్రెసైడింగ్ ఆఫీసర్ అనుమతితోనే 'అటెండెంటు' రావాలని వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ప్రలోభాలూ జరగకుండా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల లోపల ఎవరూ ఉండకుండా ఎన్నికల నియమావళి తప్పక పాటించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే అడిగి తెలుసుకోవాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన సమయానికి ఎంత మంది వరుసలో ఉన్నదీ చూసుకుని ప్రెసైడింగ్ ఆఫీసర్ టోకెన్లు అందజేస్తారన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల నియమావళిని అమలు చేయాలని చెప్పారు. సూక్ష్మ పరిశీలకుల నుంచి సందేహాలను ఆయన నివృతి చేశారు. పలు సూచనలు తెలియజేశారు.



విజయనగరంలోని ఓ విద్యా సంస్థలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రయివేటు ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

వార్త 8లో..

ఉక్కు పరిరక్షణకు ఐక్య ఉద్యమం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య ఉద్యమం చేపట్టనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 746వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం కోసం ఎంతటి త్యాగానికైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం రాజకీయ పోరాటంగా మారాల్సిన అవసరముందన్నారు. రెండేళ్లుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నా మోడీ సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇలానే వ్యవహరిస్తే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో పోరాట కమిటీ నేతలు జె.రామకృష్ణ, జి.ఆనంద్, డి.దేముడు, డి.రమేష్, జివి.రమణారావు, మహ్మద్, ఆర్.సూరిబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు

జోరుగా కార్ల అమ్మకాలు

ఏడాదికి సగటు అమ్మకాల విలువ రూ.8,800 కోట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరం, జిల్లాలోనూ కార్ల అమ్మకాలు దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పుడు నాలుగు చక్రాల వాహనాలకు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు కారును హోదాగా భావించే సగటు కుటుంబాలు, ఇప్పుడు నిత్యావసరంగా భావిస్తున్నాయి. సొంత ఇల్లు ఎంత ముఖ్యమో కారు ఉండటమూ అంతేననే ఆలోచన ఏర్పడింది. ముఖ్యంగా కోవిడ్ అనంతరం చిన్న, చిన్న ఉద్యోగులు కూడా కారు వైపు మొగ్గు చూపుతున్నారు. కుటుంబంతో కలిసి సొంతకారులో ప్రయాణించాలన్న ఆలోచన బలంగా ఏర్పడింది. దీంతో కార్లకు భారీ డిమాండ్ పెరిగింది.

ఐదేళ్ల క్రితం విశాఖ నగర పరిధిలోనే కార్ల అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలలో కూడా కార్ల అమ్మకాలు చేసే షోరూములు వెలిశాయి. చిన్న, చిన్న ఉద్యోగులు కూడా కారు కొనుక్కోవాలనే ఆలోచనలో ఉన్నారు. కోవిడ్ అనంతరం విశాఖలో కార్ల అమ్మకాల మార్కెట్ పెరిగిందని ఒక షోరూం యజమాని తెలిపారు. మహీంద్రా ఎక్స్ యూవీ 700 కొనాలనుకున్నాగానీ శ్రీకాకుళంలో ఏడు మాసాలు వెయిటింగ్ అని చెప్పారు. తెలిసిన వాళ్లుంటే విశాఖకు వచ్చి ఇక్కడ వారంతా కొంటున్నట్టు ఒక షోరూమ్‌లో కస్టమర్ ఎం.నాగరాజు తెలిపారు. నగరంలో కియా, మహీంద్రా, హ్యుందాయ్, మారుతి, టాటా వంటి కార్లకు బాగా డిమాండ్ ఉంది. కారు బుక్ చేసుకున్న తర్వాత కనీసం మూడు మాసాలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నట్టు షోరూం నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని కార్లకు ఆరు మాసాలు కూడా పడుతోందని తెలిసింది. పండుగలు, ప్రత్యేక పర్వదినాల వేళ 1500 కార్లు అమ్ముడైన సందర్భాలున్నాయి. నగరంలో కార్ల అమ్మకాల విలువ ఏడాదికి రూ.8,800 కోట్లుగా ఉంటున్నట్లు అంచనా.

కుటుంబ ప్రయాణాలపై మొగ్గు

ఒకప్పుడు బస్సు, రైలు ప్రయాణాలు ఎక్కువ. ఇప్పుడు రూ.40 వేలు వేతనం తీసుకునే ఉద్యోగి కూడా కుటుంబంతో కలిసి కారులో ప్రయాణం చేయాలనుకుంటున్నారు. దీంతోపాటు సులభతర వాయిదాల్లో లోన్లు లభిస్తున్నాయి. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో కార్లలో ప్రయాణమే మంచిదన్న అభిప్రాయంలో ఉన్నారు. కొత్త కార్లకే కాదు, తాజా గణాంకాల ప్రకారం.. సెకండ్ హ్యాండ్ కార్లకూ డిమాండ్ ఉంది. సెకండ్ హ్యాండ్ కార్లు నగరంలో నెలకు 600 నుంచి 700 వరకు అమ్ముడవుతున్నాయి. దీన్నిబట్టి సెకండ్ హ్యాండ్ కార్లకు డిమాండ్ ఉన్నట్టు ఆటోమొబైల్ నిపుణులు చెబుతున్నారు. మూడేళ్ల క్రితం నెలకు 100 నుంచి 200 కార్లు అమ్ముడయ్యేవి. ఇప్పుడు ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో రవాణా శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. మరోపక్క ఇళ్ళలో పార్కింగ్ అవకాశం లేనివారు ఇళ్లకు ఎదురుగా ఉన్న రోడ్లపై వీటిని పార్క్ చేస్తున్నారు. ఇరుకు సందుల్లో ఉన్నవారు పార్కింగ్ ప్రదేశాలను అద్దెకు తీసుకొని అక్కడ పార్కు చేస్తున్నారు. మరికొందరైతే ఇళ్లకు సమీపంలోని విశాలంగా ఉండే రోడ్లలో ఎక్కడపడితే అక్కడ కార్లను పార్క్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్ల మెకానిక్ షెడ్లు, కార్లను శుభ్రం చేసే వాషింగ్ సెంటర్లు కూడా నగరంలో పెరిగాయి.



నగరంలోని ఓ కార్ల షోరూం

మొదటి పేజీ తరువాయి..

ఎమ్మెల్సీ బరిలో 37 మంది

అనకాపల్లి జిల్లాలో 42714 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికలకు సంబంధించి విశాఖపట్నం జిల్లాలో 15 మంది సెక్టార్/జోనల్ ఆఫీసర్లు, 15 మంది రూటు ఆఫీసర్లు, 112 మంది బూత్ స్థాయి ఆఫీసర్లు, 143 మంది ప్రెసైడింగ్ ఆఫీసర్లు, 443 మంది ఇతర పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సూక్ష్మ పరిశీలకులు, 112 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు (అన్ని పోలింగు కేంద్రాలలో), ఒక మండలానికి 11 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆరు జిల్లాల్లో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అభ్యర్థుల పేర్లు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పెట్టి ఎన్నికల కమిషన్ పరిశీలనకు పంపించామన్నారు.

పోలింగ్ సమయం

పోలింగు మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని, 4 గంటల తర్వాత వరుసలో ఉన్న వారిని వీడియో తీసి వారికి టోకెన్లు అందిస్తారని, వారు మాత్రమే ఓటు వేస్తారని తెలిపారు. పోలింగు పూర్తయిన తరువాత సంబంధిత స్ట్రాంగ్ రూంలలో భద్రపరుస్తారని, మరుసటి రోజున పోలీసు బందోబస్తుతో ఆయా జిల్లాల నుంచి తీసుకువచ్చి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారని తెలిపారు. మార్చి 16న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు 28 లెక్కింపు టేబుల్స్, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్ సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. వీడియోగ్రఫీ సమక్షంలో లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు వ్యక్తిగత దూషణలకు పోరాదని అన్నారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఆయన ఇంటినిగానీ, ఇంటి ఆవరణాన్నిగానీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని తెలిపారు. పోలింగు కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిషిద్ధమని, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని అన్నారు. పోలింగు కేంద్రాలకు పోలింగు ఏజెంట్లుగా ఒకరిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

పోలీసు బందోబస్తు

నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించి పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 1162 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 50 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పోలీసు స్పందనకు 50 ఫిర్యాదులు అందాయి. నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, డిసిపి జి.నాగన్న పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని పరిష్కారానికి కింది స్థాయి అధికారులకు సూచనలు చేశారు. వచ్చిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలు, సివిల్‌కు సంబంధించినవి ఉన్నాయి.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశ ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారానికి 697వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న మత్స్యకార గ్రామంగా ఉండే విశాఖపట్నం దేశంలోనే అతిపెద్ద నగరాలలో ఒకటిగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదపడ్డాయన్నారు. వీటిలో లక్షల మందికి ఉపాధి లభించిందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి మూలస్తంభం వంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ చర్యను పోరాటాలతో అడ్డుకుంటామన్నారు.

19న జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్తాధ్వర్యాన మార్చి 19న ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గం తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వారు వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ అసెంబ్లీ హాల్‌లో ఈ ఏడాది ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం అల్పాహారంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, పండిత సత్కారం ఉంటాయని తెలిపారు. హాజరైన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక లక్కీ డిప్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నాయకులు జి.శ్రీనివాసరావు, పిఎస్.ప్రసాద్, రంగధామం పాల్గొన్నారు.

2న జగనన్న గృహ లబ్ధిదారుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగనన్న గృహ లబ్ధిదారుల సమస్యలపై 2న విజయవాడలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. మహాధర్నా పోస్టర్‌ను సోమవారం పార్టీ నగర కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎ.విమల, సిఎన్.క్షేత్రపాల్, జి.రాంబాబు పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో కొబ్బరి మొక్కలను నాటుతున్న కమిషనర్ రాజాబాబు

సాగర్‌నగర్ బీచ్‌లో కొబ్బరి మొక్కల నాటివేత

ప్రజాశక్తి -మధురవాడ : నగర సుందరీకరణలో భాగంగా సాగర్‌నగర్ బీచ్‌లో కొబ్బరి చెట్లను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు సోమవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదంతో పాటు నీడను కొబ్బరి చెట్లు అందిస్తాయన్నారు. ఇక్కడి మట్టి మంచిదని, కొబ్బరి చెట్లు బ్రతికేందుకు అనుకూలమని, సన్ రైజ్ రిసార్ట్స్ అధినేత రాజబాబు 200 కొబ్బరి చెట్లను సమకూర్చారని తెలిపారు. వారం రోజులలో అన్ని చెట్లను నాటుతారని చెప్పారు. ఈ సందర్భంగా సన్ రైజ్ రిసార్ట్స్ అధినేతను కమిషనర్ అభినందించారు. నగరాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వేత్తలు పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖ సముద్రతీరం దాదాపు 40 కిలో మీటర్లు ఉందని, ప్రస్తుతం ఆర్‌కె బీచ్ వద్ద సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుందని, ఈ రద్దీని నివారించేందుకు పలుచోట్ల బీచ్‌లను అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్‌కుమార్, హార్టికల్చర్ డీడీ ఎం.దామోదరరావు, సెక్రటరీ పి.నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేలం ద్వారా అప్పన్న ఆదాయం రూ.16.19 లక్షలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో వివిధ లైసెన్స్ హక్కుల కోసం నెల రోజులకు నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.16,19,400 ఆదాయం సమకూరింది. ఈ వేలం పాటలో దేవస్థానం లీజస్ విభాగం ఎఇఒ జంగం శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు పిల్ల శ్రీనివాసరావు, గోపీనాథ్, ట్రస్టు బోర్డు సభ్యులు రాజేశ్వరి, దేవస్థానం సిబ్బంది దొంతల రమణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కరణం మల్లేశ్వరి దంపతులు

ప్రజాశక్తి-సింహాచలం: ఒలింపిక్స్ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతక విజేత కరణం మల్లేశ్వరి దంపతులు సోమవారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ నిర్ధామనాయుడు స్వాగతం పలికారు. మల్లేశ్వరి దంపతులు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

రైతుబజారు కోసం ఎదురు చూపు



తోటగరువులో నిర్మిస్తున్న రైతు బజార్ స్టాళ్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు ఎర్నిమాంబ ఆలయానికి ఎదురుగా డెయిరీ సమీపంలో నిర్మిస్తున్న అత్యాధునిక రైతుబజార్ ఎప్పుడు పూర్తవుతుందోనని ఆరిలోవ పరిసర ప్రాంతాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. 10వ వార్డు పరిధి విమ్స్ వెనుక భాగంలో రైతుబజార్ కోసం సుమారు 46 సెంట్ల భూమి కేటాయించారు. దీనిలో 48 షాపులు, ఒక కార్యాలయం, స్టోర్ గది, ఒక టాయిలెట్ బ్లాక్, ఒక ఆర్‌ఒ ప్లాంట్‌తో కూడిన రైతుబజార్ ఏర్పాటుకు గత ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణం కోసం రూ.80 లక్షలు కేటాయించారు. ఇప్పటి వరకు 60 నుంచి 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా మిగిలిన పనులు ఎప్పటికి పూర్తి అవుతాయానని ఆరిలోవ, రవీంద్రనగర్, తోటగరువు, పెదగదిలి, చినగదిలి, హనుమంతువాక పరిసర ప్రాంతాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. సుమారు లక్షకు పైగా జనాభా కలిగిన ఈ ప్రాంతంలో రైతుబజార్ అందుబాటులో లేకపోవడంతో అధిక ధరలు వెచ్చించి కూరగాయలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ ప్రాంత ప్రజలు రైతుబజార్‌కు వెళ్లాలంటే ఎంవిపి కాలనీ, సీతమ్మధార వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అక్కడకు వెళ్లాలంటే రెండు, మూడు ఆటోలు మారాలి. ఛార్జీలతో పాటు కాలాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఈ రైతుబజార్‌ను త్వరిగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రం కోసం ధర్నా



ధర్నా వద్ద మీడియాతో మాట్లాడుతున్న దళిత నాయకులు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బాందేవుపురం గ్రామానికి చెందిన దందేటి మంగమ్మకు ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరుతూ భీమునిపట్నం నియోజకవర్గ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు నాయకత్వంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ, దందేటి మంగమ్మపై గ్రామానికి చెందిన అగ్రవర్ణాలకు చెందిన కొంత మంది దాడిచేశారని, దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం కావడంతో దరఖాస్తు చేశామని చెప్పారు. దీనిపై గ్రామానికి చెందిన విఆర్‌ఒ శ్రీనివాసరావు ఈ నెల 24న బాధితురాలి ఇంటికి వెళ్లి స్టేట్‌మెంటు నమోదు చేసుకున్నారని తెలిపారు. మరలా 25వ తేదీన వెళ్లి ముందుగా తీసుకున్న స్టేట్‌మెంట్ సరిగా లేదని మరలా ఇవ్వాలని కోరారు. సవాలక్ష ప్రశ్నలు వేసి చివరికి భాదితురాలిని క్రైస్తవరాలుగా చిత్రీకరించారని ఆరోపించారు. అధికారుల విధానం అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తూ, ఎస్‌సి, ఎస్‌టి కింద నమోదు చేసిన కేసును నీరుగార్చేలా ఉందని విమర్శించారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కిశోర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు బి.లక్ష్మి, ఎం.వెంకట్, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు డి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థో మెడికల్ క్యాంపునకు విశేష స్పందన



విమ్స్ ఉచిత వైద్య శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో సోమవారం నిర్వహించిన ఆర్థో మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఉదయం తొమ్మిది మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగిన ఈ మెడికల్ క్యాంపును విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విమ్స్ ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన ఆర్థోపెడిక్ డాక్టర్ల చేత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. అవసరమైన రోగులకు ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా థెరపీని ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మెడికల్ క్యాంపులో 187 మంది హాజరు కాగా 140 మందికి వైద్య పరీక్షలను ఉచితంగా చేసినట్లు తెలిపారు. 25 మంది వరకు ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా థెరపీని చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ టి.భవానీప్రసాద్, ఆర్‌ఎమ్‌ఒలు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్యామ్, డాక్టర్ కృష్ణ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్నడిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవారం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటరాక్ట్ ప్యానెల్స్ సరఫరా చేస్తారని, ఇంటర్నెట్ కనెక్షన్ కూడా అందించనున్నట్లు వివరించారు. డైట్ అధ్యాపకులు గొట్టేటి రవి, షేక్ అల్లా ఉద్దీన్ మాట్లాడుతూ, శక్తి వంత మైన బోధన అభ్యసన వనరుగా ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్స్‌పై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా ప్యానెల్ బోర్డుతో స్క్రీన్ కాస్ట్ చేస్తూ కంటెంట్ లేక పాఠ్యాంశాలు చూపించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారి బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ టిఐసి పాయింట్ మయూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఆరిలోవ ఎస్‌ఐ సూర్యనారాయణ కథనం ప్రకారం... మయూర్‌నగర్‌లోని ఒక ఇంటిలో వైట్ పెటల్ ప్లేస్కూల్‌ను ముఖ్వల అలేఖ్య (29) నడుతున్నారు. అలేఖ్య భర్త నరేష్ ఎఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ, సిబిఐలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరిద్దరికి ఒక బాబు, పాప ఉన్నారు. గత కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు నడుస్తున్నాయి. ఇద్దరి మధ్య మనస్పర్ధలు కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. అలేఖ్య తన కుమార్తెతో మయూర్‌నగర్‌లో ఉంటుంది. బాబు చదువు నిమిత్తం వేరే జిల్లాలో ఉంటున్నాడు. సోమవారం రాత్రి పాప బెడ్ రూంలో నిద్రిస్తున్న సమయంలో అలేఖ్య హాల్లో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కొంత సమయం పోయిన తరువాత కుమార్తె చూసి బంధువులకు సమాచారం ఇచ్చింది. సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అలేఖ్య మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతురాలు తల్లి భవాని తన కుమార్తె వేధింపుల కారణంగా మనస్థాపానికి గురై మృతి చెందినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిలోవ ఎస్‌ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురుకి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు..శ్రీకాకుళం నుండి కారులో అన్నవరం దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా నక్కపల్లి రివర్స్ కాలనీ వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న మోహన్ కుమార్, రాజ్యలక్ష్మి, కార్తీక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్సను అందించారు. పెద్ద ప్రమాదం నుండి బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

10 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- కశింకోట : పాన్‌షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. లాలం కొత్తూరు గ్రామంలో కూండ్రపు రాజు తన పాన్‌షాప్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో దాడులు నిర్వహించి, పది క్వార్టర్ మద్యం బాటిళ్లను పట్టుకున్నామని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీ శివారు ఎ. సిరసపల్లి జగనన్న లేఅవుట్‌లో ఆదివారం రాత్రి దుండగులు విద్యుత్ తీగలను దొంగిలించినట్లు పంచాయతీ కార్యదర్శి మౌనిక సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసారు. జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం కోసం 15స్థంభాలపై రెండు వేల మీటర్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే, వాటిని ఆదివారం రాత్రి దొంగిలించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గాయత్రిలో టెక్ నిర్వాణ-2023

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ, పీజీ కోర్సు విద్యార్థులకు టెక్ నిర్వాణ- 2023 సదస్సు సోమవారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రోగ్రాంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహిస్తున్న మూడు రోజుల టెక్ నిర్వాణ - 2023 కార్యక్రమంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎవిఎల్.నర్సింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కమ్యూనికేషన్ రంగంలో ఆవిష్కరణలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రజిని, డాక్టర్ వివిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, మెంబర్ అఫ్ జివిపి, డైరెక్టర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ బివి.రమణమూర్తి, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.కృష్ణవేణి, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టెక్ నిర్వాణలో పాల్గొన్న గాయత్రి విద్యా పరిషత్ ప్రతినిధులు

త్రిఫ్ట్ విద్యా ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 2021-22 సంవత్సరాల విద్యా ప్రోత్సాహక బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్టీల్ క్లబ్‌లో నిర్వహించారు. సొసైటీ ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2021-22 సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన 83 మంది విద్యార్థులకు రూ.2,48,500 విలువైన చెక్కులు, మెమొంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, సొసైటీ పిల్లల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు తెలియజేశారు. 1990 నుంచి ఈ విద్యా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నుంచి ఒబిసి కేటగిరిలో కూడా కొత్తగా విద్యా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని వివరించారు. కోశాధికారి వివిఎస్ఎస్ కొండరాజు మాట్లాడుతూ, గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.4.8 కోట్ల నికర లాభాలు సొసైటీ ఆర్జించినట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, సిఐటియు బలపరిచిన పాలకవర్గ హయాంలో 36 సంవత్సరాలు పూర్తి చేసుకుని సొసైటీ దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.శ్రీనివాస్, లాలూ భుఖ్య, జివి.రమేష్, బిజి.మహీధర్, సీనియర్ మేనేజర్ దామోదర్‌రెడ్డి, సొసైటీ సభ్యులు, మాజీ సభ్యులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యా ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో త్రిఫ్ట్ సొసైటీ ప్రతినిధులు, సిఐటియు నాయకులు



పోర్టు ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణపై ధర్నా

ప్రజాశక్తి -మాధవధార : గోల్డెన్ జూబ్లీ (పోర్టు)హాస్పిటల్ ప్రయివేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి విశాఖపట్నం పోర్టు ట్రస్టు మాజీ ట్రస్టీ సిహెచ్ మసేను మాట్లాడుతూ, పోర్టు పింఛన్‌దారులు చాలీచాలని పింఛన్లతో కాలం వెల్లదీస్తున్నారని, ఆసుపత్రిలో కూడా మెరుగైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. పింఛన్‌దారులంతా ఒక తాటిపైకి వచ్చి ఆసుపత్రి ప్రయివేటీకరణను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వమే ఆసుపత్రిని నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి అన్నవ్వ నారాయణరావు, కె.స్వతంత్రకుమార్, బి.లక్ష్మణరావు, రామారావు, రాజు, అధిక సంఖ్యలో పెన్షన్‌దారులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రావులచెరువు అసోసియేషన్ సభ్యులు

రావుల చెరువు పరిరక్షణకు వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెంలోని రావుల చెరువును పరిరక్షించాలని కోరుతూ జోనల్ కమిషనర్‌కు రావుల చెరువు అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లాజీరావు మాట్లాడుతూ, రావులచెరువుకు గత ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లు వెచ్చించి ఆధునికీకరించారని తెలిపారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే పార్క్, వాకింగ్ ట్రాక్ చుట్టూ గ్రీనరీ, రక్షణ కొరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి 4 ఏళ్ళ అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారని వివరించారు. ఈ ప్రభుత్వం వచ్చి మూడేళ్ళు పూర్తయినా ఎటువంటి పర్యవేక్షణ లేదని తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేక అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందన్నారు. విద్యుత్, నీరు లేక గడ్డి ఎండి పోతుందని తెలిపారు. సుమారు రూ.20 వేలతో ఓపెన్ జిమ్ రెండుసార్లు బాగు చేయించుకున్నామని, రివాల్వింగ్ గేట్లు విరిగి పోతే మరమ్మతు చేయించుకుంటున్నామని వివరించారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను కూడా ఆపేశారని, తద్వారా చెరువు ఎండిపోతోందని తెలిపారు. దీనిపై నెల రోజులుగా జివిఎంసి అధికారులకు విన్నవిస్తున్నా కనీస స్పందన లేకపోవడంతో స్పందనలో విన్నవించామని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారని అసోసియేషన్ అధ్యక్షుడు బొండా యల్లాజీరావు, కార్యదర్శి కూటికుప్పల జనార్ధన్, ట్రెజరర్ నాంబరు అమ్మన్న, వెంకటరావు, ప్రసాద్ తెలిపారు.

స్పందనకు అర్జీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 11 అర్జీలు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 5, ఇంజినీరింగ్, యుసిడి, ప్రజారోగ్యం విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీ, రెవెన్యూ విభాగానికి సంబంధించి 3 11 అర్జీలు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఈ అర్జీలను స్వీకరించారు.

అర్బన్ తహశీల్దార్ స్పందనకు 12 అర్జీలు

సీతమ్మధార : అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వీటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూకబ్జాదారుల నుంచి గీత కార్మికులను కాపాడాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భూ కబ్జాదారుల నుంచి పాత మధురవాడ అమాయక గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గీత కార్మిక రైతులతో కలిసి సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, మధురవాడ గ్రామ సర్వే నెంబర్ 274/1 లో 40 సెంట్లు జిరాయితీ భూమిని పాత మధురవాడలో నివాసముంటున్న పేద గీత కార్మికుల కుటుంబానికి చెందిన టేకుపూడి పెద్ద అప్పన్న, పీస పైడితల్లి తదితరులు 1957లో కొనుగోలు చేసి జీవిస్తున్నారని చెప్పారు. 2001లో కుటుంబం అవసరాలు కోసం ఇందులో 20 సెంట్లు భూమిని ఐదుగురు వ్యక్తులకు అమ్మారని తెలిపారు. ఈ స్థలాల్లో ఉడా, జీవీఎంసీ అనుమతులతో ఐదుగురూ ఇళ్లు కట్టుకున్నారని పేర్కొన్నారు. మిగిలిన 20 సెంట్లు స్థలంలో గీత కార్మికుల కుటుంబాలు పాకలు, షెడ్లు నిర్మించుకొని బతుకుతున్నారన్నారు. 2004 సెప్టెంబరు 24న పోతిన రమణ అలియాస్ పొట్టి రమణ, జివిఎంసి 5వ వార్డు మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు సాక్షి సంతకంతో దస్తావేజు సృష్టించి 3589 దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకొని కె శివరామరాజు అనే వ్యక్తికి అమ్మారని తెలిపారు.

దీనిపై రైతులు న్యాయస్థానం, సిటీలో ఫిర్యాదు చేశారని, సిట్ విచారణ చేసి ఈ భూమి రైతులకు చెందినదని తీర్పు ఇచ్చాయని వివరించారు. కొంత కాలం తరువాత రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు సిబిడి అధికారులతో బెదిరింపులు చేస్తూ అమాయక గీత కార్మికులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మీరు ఏదోలా సెటిల్ చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరిస్తున్నారని తెలిపారు. అధికారపార్టీ నాయకులకు అధికారులు కొమ్ముకాయడం, సహాయ సహకారాలు అందించడం దుర్మార్గం అని పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సిబిడి అధికారులపై నగర పోలీసు డిసిపికి కూడా ఫిర్యాదు చేశారని, వారు విచారణ చేసి సిబిడి అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. రైతులు హైకోర్టులో కూడా కేసు వేశారని, కోర్టు సిబిడి అధికారుల వైఖరిని తప్పు పట్టిందని, ఇప్పుడు మరలా కబ్జాదారులు తరుపున జగన్నాధం శ్రీనివాసరావు, బోకం నాగేశ్వరావు అనేవారు రైతులను బెదిరిస్తున్నారని చెప్పారు. గీత కార్మికులకు న్యాయం జరిగే వరకు సిపిఐ వీరికి అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ఈ నిరసనలో బాధిత రైతులు కుటుంబాలు టి.అప్పారావు, రమణమ్మ, రాము, గోరీసు, అప్పలరాజు, గువి, సీతమ్మ, కనకం, గిరి, రాము, సిపిఐ నాయకులు ఎ.విమల, ఎస్‌కె రెహమాన్, ఎమ్‌డి.బేగం, సిఎన్ క్షేత్రపాల్, జి. రాంబాబు, పి. చంద్రశేఖర్, కె.సత్యాంజనేయ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర ప్రక్రియలు, భూ ప్రమాదాలపై వర్క్ షాప్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సిఎస్ఐఆర్ -నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ సంస్థ 2023 ఫిబ్రవరి 27-28 తేదీలలో హోటల్ గ్రీన్‌పార్కులో తీర సముద్ర ప్రక్రియలు, భూ ప్రమాదాలపైనా, పరిశ్రమలు, మానవ కార్యకలాపాల పాత్రపైనా జాతీయ వర్క్ షాప్ నిర్వహించింది. భారతదేశం నలుమూలల నుంచి 50 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు, సిఎస్ఐఆర్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ లేబొరేటరీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, సర్ ఆర్థర్ కాటన్ జియోస్పేషియల్ చైర్ ప్రొఫెసర్ పి.రాజేంద్రప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రపంచ జనాభాలో దాదాపు 30 శాతం మంది హిందూ మహాసముద్ర తీరం వెంబడి నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ ప్రధాన నగరాలు, పారిశ్రామిక కార్యకలాపాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని వర్క్‌షాప్ యొక్క థీమ్‌ను వివరించారు. దీంతో తీరప్రాంత జలాలతోపాటు గాలి కూడా కలుషితమైందని, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థపై ఈ కాలుష్య కారకాల ప్రభావాన్ని విశ్లేషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత తీరం శక్తికి మూలం (గ్యాస్ హైడ్రేట్లు, పెట్రోలియం వనరులు, అరుదైన భూమి మూలకాలు మొదలైనవి), ముఖ్యంగా కృష్ణా-గోదావరి బేసిన్‌లో, భారత తీరం వెంబడి వివిధ ప్రదేశాలలో గ్యాస్, పెట్రోలియం యొక్క క్రియాశీల మైనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన మానవ, ఆర్థిక నష్టాన్ని కలిగించే భౌగోళిక కార్యకలాపాల కారణంగా అనేక భౌగోళిక ప్రమాదాలు సంభవించే అవకాశం కూడా ఉందని నివేదించినట్లు పేర్కొన్నారు. భారత తీరం వెంబడి భవిష్యత్ పారిశ్రామిక కార్యకలాపాల కోసం భౌగోళిక ప్రమాదాల యొక్క హాని కలిగించే జోన్‌ను గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్‌సింగ్, విశాఖపట్నంలోని సిఎస్ఐఆర్ సైంటిస్ట్-ఇన్‌ఛార్జ్ డాక్టర్ జిపిఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-పద్మనాభం : నిరుపేద కుటుంబానికి చెందిన దాసరి కొండమ్మకు మాతృభూమి సేవా సంఘం, హెండ్స్ సొసైటీ సంయుక్తంగా సోమవారం సుమారు రూ.6 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందించారు. మండలంలోని పెంట గ్రామానికి చెందిన దాసరి సత్తిబాబు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ట్రాక్టర్ బోల్తాపడి ఆయన మృతిచెందాడు. దీంతో మృతుని తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి యజమాని మృతిచెందడంతో కొండమ్మకు కుటుంబ పోషణ భారమైంది. దీనిని గమనించిన గ్రామానికి చెందిన గేదుల సత్తిబాబు విషయాన్ని మాతృభూమి సేవా సంఘం, హెండ్స్ సంస్థల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయా సంస్థలు ఆ కుటుంబానికి నిత్యావసరసరుకులు అందించారు. పిల్లల చదువుకు, కుటుంబ జీవనానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనోజ్, సురేష్, చిరంజివి, దేవుడు తదిరతులు పాల్గొన్నారు.

'జి-20 సదస్సుతో ఏపీకి లాభం'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మార్చి 3, 4 తేదీల్లో జరగబోయే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారిపోనున్నాయని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జి-20 సదస్సు వల్ల పెట్టుబడులు రావడంతోపాటు, ఎంఎస్ఎంఇలు మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. టిడిపి రాజకీయ లబ్ధికోసం జి-20 సదస్సుపై బురదజల్లే కార్యక్రమం చేపట్టిందని విమర్శించారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వం సరికొత్త కార్యాచరణతో ముందుకెళుందని చెప్పారు. ప్రముఖ పరిశ్రమల రాకతో స్థానికంగా ఉద్యోగ కల్పన పెరిగిందన్నారు. ఎంఎస్ఎంఇ రీస్టార్ట్, వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం వంటి పలు పథకాల ద్వారా ప్రభుత్వం రాయితీలు ప్రోత్సాహకాలు అందించి పురోగతి వైపు నడిపిస్తుందోని పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల ద్వారా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ చేయూత, ఆసరా వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. విశాఖను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ప్రాంతంగా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుతగలడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మహిళా నేత పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.

జిఒ 24పై హర్షం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రయివేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరే పేద పిల్లలకు 25శాతం ఉచిత సీట్ల కేటాయింపునకు జిఒ 24 జారీచేయడంపై ఏపీ స్టేట్ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పూర్తయిన తర్వాతనే ఈ పథకం ద్వారా ప్రయివేటు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని కోరారు. లేకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గి మూతపడే ప్రమాదముందని పేర్కొన్నారు.

పేదలకు కుట్టు మిషన్లు

ప్రజాశక్తి -గాజువాక : సిఎల్‌సి మినిస్ట్రీ గాజువాక ఆధ్వర్యాన సోమవారం 50 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శ్రీనగర్‌లోని మన్నా చర్చి ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫారినర్స్ రిక్ జాక్సన్, లెరియన్ రెస్టేశ, ఆల్ఫ్రెడ్ మహంతి, సుధీర్ మహంతి, లేర్సి, జివిఎంసి 71, 72 వార్డుల కార్పొరేటర్లు రాజాన రామారావు, ఎజె.స్టాలిన్ ద్వారా కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా సిఎల్‌సి మినిస్ట్రీ ప్రతినిధులు మాట్లాడుతూ, పేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు.

నూకాంబిక ఆలయాభివృద్ధికి రూ.3 కోట్లు

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి నూకంబిక ఆలయ అభివృద్ధికి రూ.మూడు కోట్లు కేటాయిస్తున్నట్లు వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ప్రకటించారు. సోమవారం నూకాంబికను దర్శించుకున్నారు. అనంతరం వైసిపి పార్టీ కార్యకర్తల విస్తత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. సుబ్బారెడ్డికి మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ సత్యవతి, వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, దాడి జైవీర్ ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, కార్యదర్శి దంతులూరు దిలీప్ కుమార్. కార్పొరేటర్లు లక్ష్మీ సౌజన్య, మందపాటి సునీత, జాజుల ప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పలక యశోద, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు బివి సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు, డాక్టర్ విష్ణుమూర్తి, జాజుల రమేష్, బిశెట్టి జగన్, డాక్టర్ రామ్మూర్తి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

కె.కోటపాడు : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు అందిస్తున్నారని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి అన్నారు. కె.కోటపాడులో రెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో వైసిపి సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అర్హతే ప్రాతిపదికన అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌నుమళ్లీ సిఎంను చేసేందుకు వాలంటీర్లు, గహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎంపి భీశెట్టి వెంకటసత్యవతి, అనకాపల్లి మహిళా అధ్యక్షురాలు అనురాధ మాట్లాడారు.

రేపు వడ్డాదిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి -వడ్డాది/బుచ్చయ్యపేట: విశాఖపట్నం, హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా, హెటిరో డ్రగ్స్ కంపెనీలలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనకు మార్చి ఒకటిన బుధవారం ఉదయం 10 గంటలకు కాలేజీ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రాఘవేంద్ర ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు, జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నంలో స్కిల్ సెంటర్‌లో 45 రోజులు పాటు ఫార్మ రంగంలో ఉచిత శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం ఆయా కంపెనీ యూనిట్స్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.

బిఎస్‌సి కెమెస్ట్రీ పాస్ లేదా ఫెయిల్, ఇంటర్ ఆల్ గ్రూప్స్ ఐటిఐ ఫిట్టర్ ఎలక్ట్రికల్ ,డిప్లమా మెకానికల్ ఎలక్ట్రికల్ చదివిన విద్యార్థులు, 27ఏళ్లున్న పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు మరిన్ని వివరాలకు 9290221271 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు ఇంటర్వ్యూకు హాజరు అయ్యే అభ్యర్థులు తమ వెంట విద్యార్హత సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలని సూచించారు.

'స్పందన' సమస్యలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి



అర్జీదారుల సమస్యలు వింటున్న జెసి కల్పనాకుమారి

ప్రజాశక్తి- అనకాపల్లి : తమ సమస్యల పరిష్కారం కోసం స్పందనలో అర్జీలు పెట్టుకున్న వారికి స్పష్టమైన సమాధానం అధికారులు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటరమణ తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులను సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి కల్పనాకుమారి మాట్లాడుతూ, సమస్య పరిష్కారమయ్యేది, లేనిది దరఖాస్తుదారునకు తెలియజేస్తారని, తిరస్కరిస్తే ఎందుకు తిరస్కరించామో విషయం తెలియ చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే అర్జీదారులు పదేపదే దరఖాస్తులు స్పందనలో పెట్టడం జరుగుతుందన్నారు. దీనివల్ల అధికారులకు, అర్జీదారులకు కాలం వృథా అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో అర్జీదారుని దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన సమాధానం ఇవ్వాలన్నారు. కాగా స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 268 దరఖాస్తులు వచ్చాయి.

డైట్ ఇసిఇ విద్యార్థుల ప్రతిభ

ఆటో కట్ ఎలక్ట్రిక్ బైక్ ఛార్జర్ రూపకల్పన



ఆటో కట్ ఎలక్ట్రిక్ బైక్ ఛార్జర్,తయారు చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : బ్యాటరీ టెంపరేచర్ పెరగగానే ఛార్జర్ ఆఫ్ చేసే పరికరాన్ని డైట్ ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ ఇసిఇ విద్యార్థులు తయారుచేసి తమ ప్రతిభను చాటారు. ప్రస్తుతం బ్యాటరీ వెహికల్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో టెంపరేచర్ పెరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇసిఇ మూడో సంవత్సరం విద్యార్థులు పరిష్కార మార్గంగా ఈ పరికరాన్ని కనిపెట్టారు.

వై శ్రీరామ్, సాయికుమార్, యశ్వంత్‌ని, సంజన, దివ్యశ్రీ కనిపెట్టిన ఈ పరికరం ఛార్జింగ్‌లో ఉండగా టెంపరేచర్ పెరిగితే ఈ పరికరం ద్వారా ఆటోమేటిక్‌గా ఉష్ణోగ్రత తగ్గి ప్రమాదాలు జరగకుండా నివారిస్తుందని ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ పి పూర్ణప్రియ తెలిపారు. ప్రాజెక్టు ఇంజనీర్ భమిడిపాటి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు ప్రశంసించారు.

120వ రోజుకు నాబ్ దీక్షలు



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- రాంబిల్లి : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వాడ నరసాపురం వద్ద నాబ్ మెయిన్ గేట్ ముందు రోడ్డుపై నేవీ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు సోమవారం 120వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎనిమిది గ్రామాల నిర్వాసిత జెఎసి నేతలు మాట్లాడుతూ, తమ సమస్యలను పరిష్కరించకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తమ భూములను లాక్కొని, ఇచ్చిన హామీలు, సమస్యలను పరిష్కరించకుండా పిల్లాపాపలతో, మహిళలు, కుటుంబాలతో రోడ్డెక్కి ఆందోళన చేసే పరిస్థితులు కల్పించడం దుర్మార్గమని, ఇప్పటికైనా అధికారులు, నేతలు కళ్లు తెరిచి, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాని డిమాండ్ చేశారు. సోమవారం ధర్నాల్లో పెద్దఎత్తున నిర్వాసిత కుటుంబాల మహిళలు, జెఎసి నేతలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా

మధ్యాహ్న భోజన మెనూ ఛార్జీలు పెంచాలి



ఆర్‌డిఒకు వినతి పత్రం ఇస్తున్న ఎఐటియుసి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు పెంచాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ చిన్నికృష్ణకు ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు, అనకాపల్లి జిల్లా సమితి కోకన్వీనర్ కోన లక్ష్మణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్లుగాపనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో భోజన నిర్వహణకు కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తగా మెనూలో రాగి మాల్ట్ ఇవ్వాలని ప్రభుత్వం చెబుతోందని, అయితే అందుకు అవసరమైన ఛార్జీలు మాత్రం పెంచలేదన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.30 మెనూ చార్జీలు ఇవ్వాలని, కార్మికులకు పదివేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భోజన కార్మికులపై పలుచోట్ల రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయని, వాటిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో వై రాజుబాబు, వాయిబోయిన శేఖర్, కోన నూకరాజు పాల్గొన్నారు.

అట్టహాసంగా వన సమారాధన



అతిథులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణ దేవాంగ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో తుమ్మపాల బంగార్రాజు కల్యాణ మండపం ఆవరణలో సోమవారం ఆత్మీయ వనసమారాధన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సుమారు 2500 మంది దేవాంగులు తమ కుటుంబాలతో పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు వంటావార్పులు, ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాధరావు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, అంతర్జాతీయ కళాకారుడు బొట్ట నాగేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, సంఘం రాష్ట్ర కోశాధికారి ఉప్పు కనకరాజు, ముప్పన సిల్క్స్ అధినేత ముప్పన సుబ్రమణ్యాం, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు

కరాటే పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ మహేష్

ప్రజాశక్తి -కశింకోట : ఎపి ఇన్విటేషన్ ఆల్ స్టైల్ కరాటే పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 26 న తునిలో పోటీల్లో పాఠశాలకు చెందిననలుగురు ప్రథమస్థానంలోముగ్గురేసి ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రిన్సిపల్ మహేష్ తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌ఛార్జి రూపానంద్, కరాటే కోచ్ సిహెచ్ అప్పారావు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నారు

భవిత కేంద్రం విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలో ప్రత్యేక అవసరాల పిల్లల భవిత కేంద్రం (ఐఇఆర్‌సి)లో విద్యార్థులకు బవులువాడ పంచాయతీ దర్జీ నగర్‌కు చెందిన హెల్పర్స్ జోన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు, పలకలు, గ్లూకోస్ బిస్కెట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి మోటూరు భాను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రానికి మరిన్ని సేవా సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కొప్పాక ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు భారతి, వీఆర్వో సత్యనారాయణ మూర్తి, భవిత కేంద్రం టీచర్స్ సిహెచ్. రమాదేవి, ఎస్ ఏసు రత్నం, ఆయా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు

ఆజాద్ స్ఫూర్తితో పోరాడుదాం

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిలో సిఐటియు నేత గనిశెట్టి



చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-పరవాడ: స్థానిక మండల పరిషత్ జంక్షన్‌లో చంద్రశేఖర్ ఆజాద్ 92 వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నేటి యువత చంద్రశేఖర్ ఆజాద్ దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు సత్యాగ్రహం, స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటంలో పాల్గొన్న గొప్ప వీరుడు ఆజాద్ అని కొనియాడారు. ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత దేశాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు పిడి నాయుడు, కె.అప్పారావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల వివి.రమణ సుగర్స్ సమాచారం

లిఖిత పూర్వకంగా ఇవ్వాలి

లిక్విడేటర్‌కు షేర్‌హోల్డర్ల వినతి



లిక్విడేటర్ శాస్త్రికి వినతిపత్రం ఇస్తున్న షేర్‌హోల్డర్లు

ప్రజాశక్తి- అనకాపల్లి : తుమ్మపాల వివి రమణ సహకార చక్కెర కర్మాగారానికి సంబంధించిన సమాచారం లిఖిత పూర్వక ఇవ్వాలని కోరుతూ సోమవారం సుగర్ ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్లి మోదునాయుడు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ లిక్విడేటర్ శాస్త్రికి వినత పత్రం అందజేశారు. ఫ్యాక్టరీ సభ్య రైతుల జనరల్ నెంబర్ జాబితా, ఫ్యాక్టరీ నియమ నిబంధనలు, ఫ్యాక్టరీలో చివరిసారిగా నిర్వహించిన మహాజనసభ, అందుకు సంబంధించిన నోటీస్ కాపీ, ఆడిట్ నివేదిక, ఆడిట్ నివేదిక నకలు వంటి సమాచారం ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో సిపిఐ నాయకులు భద్రం, విల్లూరి పైడారావు, బొట్ట చిన్ని యాదవ్, శ్రీరామదాసు గోవింద, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు, బిశెట్టి అప్పారావు, కొణతాల సీతారాం పాల్గొన్నారు.

పశువుల కంటైనర్ పట్టివేత

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్ జాతీయ రహదారిపై కంటైనర్ లారీతో అక్రమంగా తరలిస్తున్న 42 ఎద్దులు రెండు ఆవులను ముందుగా అందిన సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి తెలిపారు. హైవే రోడ్డుపై అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు కంటైనర్ లారీని వాహన తనిఖీ చేస్తుండగా తాళ్ళపాలెం జంక్షన్‌లో పట్టుకున్నామన్నారు. కంటైనర్ లారీని స్వాధీనం చేసుకొని, నిందితుడు కర్ణాటక రాష్ట్రంలోని హసన్ జిల్లా బింధ్రా గ్రామానికి చెందిన మోహన్ బిద్రా దయనాడను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వ్యాయామ ఉపకరణాలకు తుప్పు

కొత్తవి ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు డచ్ సమాధుల సమీపాన ఖాళీ ప్రదేశంలో జివిఎంసి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వ్యాయామ ఉపకరణాల్లో కొన్ని విరిగి పోగా, మరికొన్ని తుప్పు పట్టి ఉన్నాయి. వీటిపై పిల్లలు, యువకులు వ్యాయామం చేస్తే పొరపాటున దెబ్బలు తగిలే అవకాశం లేకపోలేదు. జివిఎంసి ఆధ్వర్యాన రూ.12.30 లక్షలతో ఏర్పాటు చేసిన సుమారు 11 వ్యాయామ ఉపకరణాలను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంత్రిగా ఉన్న పుడు 2019 జూన్ 27న ప్రారంభించారు. ఏర్పాటుచేసిన రెండేళ్లకే సంబంధిత ఉపకరణాలు తుప్పుపట్టి ఉండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వాటి నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి కూడా. ఇప్పటికైనా తుప్పు పట్టిన, విరిగిన ఉపకరణాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బీచ్ వద్ద ఏర్పాటు చేసిన వ్యాయామ ఉపకరణాలు

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహనాసదస్సులో మాట్లాడుతున్న సిఐ ఈశ్వరరావు

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ పోలీసులు, సంస్కృతి స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్, లైంగిక వేధింపులు, మాదకద్రవ్యాల వినియోగం, కుల, మత, వర్ణ, వివక్షలతో కలిగే అనర్థాలు, వాటిని అరికట్టడానికి వ్యవహరించాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరవాడ సిఐ ర్ పి. ఈశ్వరరావు హాజరై మాట్లాడుతూ యువతరం శిరస్సు ఎత్తితే, నవతరం గళం విప్పితే కమ్ముకున్న చీకటి తరలిపోతుందని రోజులు పోయి, నేటి యువత తప్పుదోవ పట్టి, అసాంఘిక కార్యక్రమాలకు ఆకర్షితులై బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవడం బాధ కలిగిస్తోందన్నారు. యువత పక్కదోవ పట్టకుండా చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుపై దృష్టిపెడితే చెడు వ్యసనాలు దరిచేరవన్నారు.దీనిపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూనే, మరోవైపు వారి తల్లిదండ్రులకు అప్రమత్తం చేస్తున్నామన్నారు. పాఠశాల సిఇఒ కె. నిశంత్ మాట్లాడుతూ, విద్యార్థులు తప్పుదోవ పట్టకుండా విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘిక చర్యల నియంత్రణలో పోలీసుల సేవలను కొనియాడారు.

సమస్యల పరిష్కారానికి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పరవాడ: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌టిపిసి మెయిన్ గేట్ వద్ద టిఎన్‌టియుసి అధ్యక్షుడు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ, కార్మికులకు డస్ట్ అలవెన్స్ పెంపుదల, మెడికల్ చెకప్ నిలుపుదల, రంగు రంగుల పాస్‌లు జారీ నిలిపివేసి, కార్మికులు అందరికీ ఒకే కలర్ పాస్‌లు ఇవ్వాలని, కార్మికులు అందరికి ఐడెంటిటీ కార్డ్స్ మంజూరు చెయ్యాలని, కోవిడ్‌లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఎన్‌టిపిసి సింహాద్రి యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆందోళన చేస్తున్నట్లు వెల్లడించారు.



ఎన్‌టిపిసి మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గిరిజనుల ప్రాణాలకు ఏదీ భరోసా?

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

ప్రజాశక్తి- అడ్డతీగల : ఇంట్లో, గ్రామాల్లో ఉన్నా, పాఠశాల, హాస్టళ్లకు వెళ్లినా, చివరకు సాధారణ కేసుల్లో శిక్ష పడి జైలుకు వెళ్లినా, ఎక్కడైనా గిరిజన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేశారు. సోమవారం రాజమండ్రి జైలులో అనుమానాస్పదరీతిలో మృతి చెందిన అడ్డతీగల మండలం బొడ్డంక పంచాయతీ అచ్చీపేట గ్రామానికి చెందిన కన్నోజీ రాజుబాబు కుటుంబాన్ని రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, రాజవొమ్మంగి మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబుతో కూడిన గిరిజన సంఘం నేతల బృందం పరామర్శించింది. బాధితులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకుని, వారిలో మనోధైర్యాన్ని నింపారు.ఈ సందర్భంగా మృతుడు రాజుబాబు తల్లి, ఇతర కుటుంబసభ్యులు మాట్లాడుతూ, ఈ నెల 23న రాజాబాబు తమతో మాట్లాడాడని, మరుసటి రోజునే ఆయన చనిపోయినట్లు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి సమాచారం వచ్చిందని వివరించారు. తన కొడుకు రాజాబాబును చంపేశారని, మెడపై గాయాలు, రక్కులు ఉన్నాయని అలాగే రెండోరోజున చూస్తే వీపుభాగాన రక్తం కారి ఉందన్నారు. మృతిపై తాము అనుమానం వ్యక్తం చేసి, ఎంతగా గగ్గోలు పెట్టినా, మీడియా వాళ్ళ సెంట్రల్ జైల్ అధికారులే చెప్పింది రాసుకుని, పేపర్లలో అదే ప్రచురించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసాధారణ మరణమని స్పష్టంగా తెలుస్తున్నా ఎవరూ కనీసం అనుమానాస్పద మృతిగానైనా రాయక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దీనిపై జోక్యం చేసుకుని తమకు న్యాయం చేసేలా చూడాలని గిరిజన సంఘం నేతల వద్ద వాపోయారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ, ఏజెన్సీలోని గిరిజనులకు ఎక్కడున్నా ప్రాణాలకు రక్షణ లేకుండా పోవడం బాధాకరమన్నారు. రాజాబాబు మృతిపై వారి కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. మన్యవాసుల మరణాలను నియంత్రించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు ఆదివాసీ సంఘాలన్నీ పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.


వార్డు మహిళా పోలీస్ సంక్షేమ సంఘం

నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - వడ్డాది : ఎపి గ్రామ వార్డు మహిళా పోలీసుల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా విజయరామరాజుపేట మహిళా పోలీస్ జనపరెడ్డి భార్గవి వెంకటలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గంటికొర్లాం మహిళా పోలీస్ నసీమా వేగం ఎన్నికయ్యారు. ఈ నెల 22న గుంటూరులో జరిగిన ఎపి గ్రామ వార్డు సచివాలయ మహిళ పోలీస్ వెల్ఫేర్ అసోసియన్ ఎన్నికల్లో అనకాపల్లి జిల్లా కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా జి కుసుమకుమారి, జనరల్ సెక్రెటరీగా ఉమా, అడిషనల్ జనరల్ సెక్రెటరీగా కె రత్న శిరీష, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.విజయలక్ష్మి (రేపాక) ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా డివిజి శేషు కుమారి (జనగుమ్మలూరు) వైస్ ప్రెసిడెంట్‌గా బి మల్లీశ్వరి (గోవిందపాలెం) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె సంతోషికుమార్ (ఎలమంచిలి) పాతిమా (ఎలమంచిలి) వి రమాదేవి (వీడికాడ) .డి పద్మశాలిని (సబ్బవరం), ట్రెజరర్‌గా. వరలక్ష్మి (దేవరపల్లి(ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే శిరీష (ఉడేరు). గుంట సునీత (డి ఎల్ పురం)చ మేడపాటి వెంకట సౌజన్య (శ్రీ నాయుడుపాలెం) టి రేణుక (పైడివాడ అగహారం), ఆర్ఎస్‌కె గాయత్రి (అనకాపల్లి) ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా. విజయలక్ష్మి (నర్సీపట్నం),. శ్యామల (రొంగలి నాయుడుపాలెం), సుమిత సాయి (చెట్టుపల్లి), వి రాజేశ్వరి (కోటవురట్ల), జ్యోతి (పాత మల్లంపేట), ఆర్ సుజాత (కసింకోట). మహిళా పోలీసులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

వెంకన్న ఉత్సవ స్థలంలో వాలంటీరుకు ఇంటి స్థలం

- స్పందనలో టిడిపి నేతల ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వడ్డాది వెంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు, ఇతర సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలంలో వడ్డాదికి చెందిన గ్రామ వాలంటీర్ దువ్వాడ శంకరరావుకు స్థలాన్ని మంజూరు చేయడంపై వడ్డాది పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొండ నరేష్, కోరుకొండ గురుమూర్తి, తదితరులు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు దీనిపై ఈనెల 15వ తేదీన తహసిల్దార్ ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. వెంకన్న ఉత్సవాలు, ఇతర అవసరాలకు పూర్వం నుంచి గ్రామ పెద్దలందరూ కేటాయించిన స్థలాన్ని అవివాహితుడైన వాలంటీరుకు నిబంధనలకు విరుద్ధంగా, అధికార పార్టీ నేతలు ప్రోద్బలంలో అధికారులు కేటాయించడం సరికాదన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి సామాజిక, ఆధ్యాత్మిక అవసరాల కోసం ఉంచిన స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా వార్డు వాలంటీరుకు ఇవ్వడంపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జివి.రమణ,కె.చంద్రరావు, బి.రాజు, ఎం. అప్పారావు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



నిరసన చేపడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి -నక్కపల్లి:చోడవరం మండలం అడ్డూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సతీష్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సచివాలయ మండల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు కంబాల రాజు తెలిపారు. ఉపమాక సచివాలయం వద్ద సోమవారం దాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సంఘటనపై వెంటనే విచారణ చేపట్టి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మండలంలో సచివాలయ ఉద్యోగులు దాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు సురేష్, శ్రావణి, నిరోషా, జయశ్రీ, నాగలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

చీడికాడ:వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ మండలంలోని జైతవరం సచివాలయం వద్ద పశుసంవర్ధక జిల్లా కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది అప్పన రమణబాబు, సిహెచ్ చిన్నమ్ములు, శ్రీదేవి, మార్తాండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చీడికాడలో చేపడుతున్న నిరసన



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆక్రమణల తొలగింపునకు వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని రేబాక గ్రామంలో ఆక్రమణలు తొలగించి, ఆక్రమణదారుడుపై చర్యలు తీసుకోవాలని సోమవారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో రైతులు ఇన్చార్జ్ తహసీల్దార్ నీరజకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 213లో బుచ్చిరాజు చెరువుకు నీరు వచ్చే గోర్జను, సర్వే నెంబర్ 178లో నల్లమాటి కొండ తాలూకా భూమిలో నిరుపేదలకు ఇచ్చిన డి ఫారం భూములకు వెళ్లే దారిని ఒక వ్యక్తి ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జీడి తోటలోకి వెళ్లే మార్గాన్ని ఆక్రమించుకోవడంతో రైతులు తోటల్లోకి వెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీను, అప్పారావు, సత్తిబాబు, టిడిపి నాయకులు అడ్డూరి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

4న బహిరంగ వేలం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య జాతర ఉత్సవం సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరి ముక్కల హక్కులకు మార్చి 4న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు దేవాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఒ బివివిఎస్ఎస్.మురళీకృష్ణ తెలిపారు. పాటదారులు ముందుగా ధరవత్తు సొమ్ము రూ.25వేలు చెల్లించి పాటలో పాల్గొవాలన్నారు. పాట అనంతరం వెంటనే ప్రథమ ధరావత్తుతో కలుపుకొని మొత్తం సొమ్ము వెంటనే చెల్లించాలన్నారు. ప్రతీ పాటదారుడు ఆధార్ కార్డు నకలు, సాల్వేన్సీ సర్టిఫికేట్ రూ.లక్ష తక్కువ కాకుండా ఆయా గ్రామాల రెవెన్యూ అధికారి వద్ద నుండి పొంది పాటకు ముందు దేవస్థానం అధికారులకి సమర్పించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని ఒమ్మ వరం గ్రామం వద్ద వరహానదిలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృహదేహం కొట్టుకు వస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు నక్కపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మృతుడు లింగరాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థినుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా



ఆందోళన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని లింగరాజు పాలెం గ్రామంలో జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యమ్. సత్యన్నారాయణ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ సరైన వసతులు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సదుపాయాలు కల్పించకపోవడంపై తమ ఆవేదన తెలియజేసినప్పటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తక్షణమే దార్లపూడి గ్రామంలోని భవనంలో అన్ని సదుపాయాలు ఉన్నందున అక్కడికి బదిలీ చేసి విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి ఫెడరేషన్ సభ్యులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం 9వ వార్డులో సోమవారం జనసేన నాయకులు మారిశెట్టి రాజా, కొత్తకోట రామశేఖర్ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రాణాలు పణంగా పెట్టిన కార్యకర్తలు ఆకస్మికంగా మరణించినా, ఏదైనా ప్రమాదం జరిగినా బాధిత కుటుంబానికి ఇన్యూరెన్స్ భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, సూరిభూమి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేపడుతున్న నేతలు

సిపిఎస్ రద్దు ఏదీ : అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సిఎం జగన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేపట్టిన పాదయాత్రలో అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి మరచి పోయారని టిడిపి నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మీడియాకు పంపిన వీడియోలో విమర్శలు గుప్పించారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.ఉపాధ్యాయుల అవసరాలకు దాచుకున్న పీఎఫ్ డబ్బులు సుమారు 900 కోట్ల వరకు వాడేసారన్నారు. ఎలక్షన్ విధుల నుంచి ఉపాధ్యాయులు తప్పించారన్నారు.

మురుగు నీటితో అవస్థలు

ప్రజాశక్తి -మాకవరపాలెం:మండలంలో తూటిపాల గ్రామంలో రోడ్డు పై మురుగు నీరు పారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కాలువలు లేక పోవడంతో ఇంట్లో వాడుక నీరంతా రోడ్డు పై పారుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహన దారులతో పాటు స్థానికులు పేర్కొన్నారు. మురుగు నీరు రోడ్డుపై నిలిచి ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. దీంతో ఎప్పుడు ఏ రోగాలు వచ్చి పడతాయోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం బ్లీచింగ్ వేసి, మురుగు నీరు పోయేందుకు మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :స్థానిక ప్రభుత్వ ఐటిఐలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.పరమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందే యువకులు ఆధార్ కార్డు తో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. క్యాపిటల్ గూడ్స్, ఫ్యాబ్రికేషన్ ఎలక్ట్రిషన్ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9441651126, 9491813637 నెంబర్లకు సంప్రదిం చాలని కోరారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చీడిక కొత్తూరులో ఎస్ఐ శిరీష తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి కోడిపందాల శిబిరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో మూడు కోళ్లను స్వాధీను పరుచుకుని, ముగ్గురు వ్యక్తుల ను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.




పట్టుబడిన నిందితులతో పోలీసులు

రాష్ట్రంలో నిరంకుశ పాలన

శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల

ప్రజాశక్తి -యస్.రాయవరం:2024లో జరగనున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టిడిపి సీనియర్ నాయకులు, శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు జోస్యం చెప్పారు. మండలంలోని అడ్డురోడ్డు టిడిపి కార్యాలయంలో నక్కపల్లి పార్టీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అధ్యక్షతన ఆదివారం రాత్రి నిర్వహించిన నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం అత్యవసరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసిగి పోయారని, రాష్ట్ర చరిత్రలో ఇటువంటి నిరంకుశ పాలన చూడలేదని ఆయన అన్నారు. ప్రజల నిత్యావసరాలపై దృష్టి పెట్టని ముఖ్యమంత్రి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసాడన్నారు. రాష్ట్రంను అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిపిన ముఖ్యమంత్రి మూడు రాజధానులు అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. శాఖలపై పట్టు లేని మంత్రులు అభాసుపాలవుతున్నారని, ఇటువంటి ప్రభుత్వాన్ని చూసి ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా నవ్వుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులతో పాటుగా ఇసుక, మద్యం మాఫియా నడుస్తుందని తెలిపారు.మళ్ళీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నీరు, గాలి కూడా అమ్మకం పెట్టేంత సమర్థులని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే మళ్ళీ చంద్రబాబు రావాలని, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రతీ ఒక్కరు కష్టపడి గెలుపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగినా ఒక ఆడపడుచుగా వంగలపూడి అనిత పోరాడుతున్నారని కొనియాడారు. పాయకరావుపేట టిడిపి అభ్యర్థి అనిత దేనని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా పోలిట్‌బ్యూరో సభ్యురాలు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే ఒక్క తెలుగుదేశం పార్టీవల్లనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సెక్రటరీ లాలం కాశీ నాయుడు, కోటవురట్ల టిడిపి మండల అధ్యక్షుడు జానకి శ్రీను, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గింజ లక్ష్మణరావు, నక్కపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపాధ్యక్షులు రమణ, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా మత్స్యకార అధ్యక్షుడు గోసల చినతాతారావు, జిల్లా అధికార ప్రతినిధి మానేపల్లి రాఘవ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యనమల



విద్యార్థులకు బోధిస్తున్న పరిశీలకులు శంకర్

విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని పెంచాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:విద్యార్థుల్లో ప్రాథమిక దశ నుండే చదువులో కనీస అభ్యసన స్థాయిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని లెర్నింగ్ టీచింగ్ జిల్లా పరిశీలకులు శంకర్ సూచించారు. మండలంలోని సోమవారం నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల లో 3,4,5 తరగతుల్లో ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించారు. కరోనా సమయంలో 1వ తరగతిలో చేరిన విద్యార్థులు చదువులో బాగా వెనక పడ్డారని, చదవడం రాయడం రాని విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి సారించి లెర్నింగ్ టీచింగ్ ప్రోగ్రాం ద్వారా వారిలో కనీస స్థాయిని పెంపొందించాలన్నారు.ప్రారంభ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రూపులుగా విభజించి, ధారాళంగా చదవడం, అదేవిధంగా రాయడం నేర్పించాలన్నారు.ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని నేరుగా పరిశీలించారు. ఆయన కూడా విద్యార్థులకు అనేక కృత్యాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డివిడి ప్రసాద్ పాల్గొన్నారు.



సామగ్రిని ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

పాఠశాలకు హెచ్‌పిసిఎల్ వితరణ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో సుంకపూరు మండల పరిషత్ పాఠశాలకు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులు రెండు లక్షల రూపాయల విలువ గల ఫర్నిచర్, బీరువాలను అందజేశారు. స్థానిక పాఠశాల చైర్మన్ సన్యాసినాయుడు ఆధ్వర్యాన సంస్థ ప్రతినిధులు చిరంజీవి, బిందు సాయి, కృష్ణంరాజు, చేతుల మీదుగా మండల విద్యాశాఖ అధికారి అప్పారావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి, ఎంఈఓ అప్పారావు, పాఠశాల సిబ్బంది హెచ్పీసీఎల్ సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఎంఈఓ అప్పారావుకు సిబ్బంది, సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిక్కిన చేప

వలకు చిక్కిన భారీ చేప

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని మత్స్యకార గ్రామమైన బంగారమ్మపాలెం సముద్ర తీరంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు సోమవారం తెల్లవారుఝామున సుమారు 1500 కేజీల బరువైన ముక్కుడు టేకు చేప వలకు చిక్కింది. ఇటువంటి భారీ చేపలు అరుదుగా వలకు చిక్కుతాయని, ఈ చేప రెక్కలతో కొడితే మనిషికి తీవ్రగాయాలు అవుతాయని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఈ భారీ టేకు చేపను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలి వచ్చారు.

కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం



కె.కోటపాడులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రజల సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని లంకవానపాలెం గ్రామంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు, ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై అవగాహన, పోరాడే స్వభావం ఉన్న రమాప్రభను ఉత్తరాంధ్ర జిల్లాల్లో 250 ప్రజాసంఘాలు బలపరుస్తున్నాయన్నారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని సర్పంచ్ వి. దొరబాబుతోపాటు పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోడవరం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఎల్ఐసి యూనియన్ రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్ కోరారు. సోమవారం స్థానిక ఎల్ఐసి ఆఫీసులో కార్యాలయంలో ఏజెంట్ యూనియన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజెంట్ ఎఓఐ నాయకులు నాగరాజు మోహన్ శ్రీనివాస్, శంకర్, ప్రేమ చంద్రశేఖర్, లోవరాజు పాల్గొన్నారు.



చోడవరంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

అనంతగిరి:ప్రజా సంఘాలు బలపరిచిన పీడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరేడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని కొండిభ పంచాయతీ, అనంతగిరి, టోకూరులో ప్రజా సంఘాల నేతలు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, సర్పంచ్ కె. మొత్యలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, 250 ప్రజా సంఘాలు బలపరిచిన రమాప్రభను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఎస్. నాగులు జె. సుబ్బారావు ఎస్. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో జెడ్‌పిడిసి గంగరాజు చేపడుతున్న ప్రచారం

ప్రయివేటు ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. సోమవారం విజయనగరంలోని పలు విద్యాసంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. అటువంటి ఫ్రంట్ తనను బలపర్చడం గర్వకారణమన్నారు. ఇప్పటి వరకు సామాజిక సమస్యలపై పోరాడానని, పట్టభద్రులు అవకాశం కల్పిస్తే చట్టసభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రయివేట్ విద్యాసంస్థల సిబ్బంది హక్కుల కోసం పనిచేస్తానని చెప్పారు. వారందరికీ గుర్తింపు కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ప్రజల గొంతుకనై పనిచేస్తానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసే గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటేష్, పి.రామ్మోహన్, నాయకులు పావని, రామకృష్ణ, లావణ్య, సంధ్య, బాలాజీ, సోమేశ్, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల: వచ్చే నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన 179 పోలింగ్ కేంద్రాన్ని సోమవారం తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, రూట్ ఆఫీసర్ నరసింహారావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

గొలుగొండ:ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గొలుగొండ యుపి స్కూల్‌లో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌ను తహశీల్దార్ జి.ఆనందరావు పరిశీలించారు. గొలుగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్ నెంబర్ 165ను అన్ని విధాలుగా ఎన్నికలకు సిద్ధం చేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండల కేంద్రంలో ఎప్పటిలాగే ప్రభుత్వం గుర్తించిన భవనంలోనే బూత్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు అనువుగా ఉండే విధంగా తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం ఉండేవిధంగా సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఆర్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ ఆనందరావు

నేడు యుటిఎఫ్ మండల మహాసభ

డుంబ్రిగూడ: మండల కేంద్రంలో ఈనెల 28న యుటిఎఫ్ మండల మహాసభను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రశేఖర్, ఎస్.కన్నయ్య తెలిపారు.











